

# ది ఎండ్..

నది వెనకనున్న కొండల్లో సూర్యాస్తమయం అవుతోంది. అలల అంచున కాళ్ళకి మువ్వలు కట్టిన రెండు ఎద్దులు ఒక గూడు బండిని లాక్కెళ్తున్నాయి. గూడు లోపల వున్న ఆ ఇద్దరు ప్రేమికులూ ఇష్టంగా విషంతాగి లోపల్నుంచే కొండల్లోకి దిగుతున్న సూర్యుణ్ణి చూస్తున్నారు.

అంతసేపూ అలల అంచున ప్రయాణం చేసిన ఆ గూడు బండి మలుపు తిరిగి ఇప్పుడు సరాసరి సూర్యుడివైపు వెళ్తోంది.

THE END

గత రెండున్నర గంటల్నుంచీ నిశ్శబ్దంగా ప్రివ్యూ చూసిన ప్రేక్షకులు ఆడిటోరియంలో నెమ్మదిగా లేచి, థియేటర్ మెయిన్‌గేటు దగ్గర నిశ్శబ్దంగా నిలబడి వున్న ఆ తమిళ సిన్మా డైరెక్టర్ అమరన్‌ని "ఇది నీకు ఫస్ట్ ఫిల్మ్ అంటే నమ్మబుద్ధి కావడం లేదు.... ఈ కథకి కరెక్ట్ ఎండ్ అదే... అసలు ఇలా ముగిద్దామనే ఆలోచన నీకు రావడం చాలా గొప్ప విషయం." అలా రకరకాలుగా అభినందించి వెళ్ళిపోయాక, ప్రొడక్షన్ వాళ్ళ కారెక్కిన అమరన్, నగరంలో ఆమధ్యనే కొత్తగా పెట్టిన 'లాండ్‌మార్క్' అనే షాపుకెళ్ళి రెండు మూడురకాల లెటర్‌పేడ్‌లూ, శాండల్‌స్టిక్ పెన్‌లూ కొనుక్కుని ఉడ్‌లాండ్స్ డ్రైవ్ ఇన్ రెస్టారెంట్‌కెళ్ళి కూర్చున్నాడు.

ఇక్కడ కావ్యం వుంది. నాయిక లేదు... రాయడం మొదలు పెట్టిన అమరన్‌కి తర్వాతవాక్యం ఎలా మొదలుపెట్టాలో తోచక ఆ కాయితం చింపేశాడు.

'నువ్వు వస్తానంటావు. బృందావనంలా నా ఒళ్ళో వాలతానంటావు. పురి విప్పిన నీ అధరంతో ఆందంగా నవ్వుతావు. విరబూసిన నీ నయనంతో విచిత్రంగా ప్రమాణం' చేస్తావు...కానీ రావు. ఆ తర్వాతేం రాయాలో అర్థంగాక మళ్ళీ ఆగిపోయాడు.

ఆ రోజంతా ఏదో విధంగా ఒక ప్రారంభం చేస్తూనే వున్నాడు. ముగింపు వాక్యాలు మాత్రం దేనికీ పలకలేదు. అలా ప్రతిరోజూ ఆ రెస్టారెంట్‌కి వస్తూనే వున్నాడు. తన రాని ప్రేయసికోసం ఏదో రాస్తూనే వున్నాడు. ఏదీ పూర్తిచేసి పోస్ట్‌చెయ్యడం జరగడంలేదు.

ఆ రోజు తన సినిమా తమిళనాడంతా విడుదల కాబోతోంది. నిజానికి ప్రతి కొత్త దర్శకుడి భవిష్యత్తుని చెప్పే రోజది. సినిమా విడుదలైన ప్రతి థియేటర్ తిరుగుతూ జనం ఎలా రియాక్ట్ అవుతున్నారో గమనిస్తూ, ఎగ్జిబిటర్స్‌ని కలుసుకుని సినిమా ఫ్యూచర్ తెలుసుకుంటారు కొత్త డైరెక్టర్లు. ఎవరికీ కనిపించకుండా. ఎక్కడికి వెళ్ళకుండా సరాసరి రెస్టారెంట్‌కి వచ్చేశాడు అమరన్.

కాస్త పెరిగిన గడ్డం, నలిగిన బట్టల్తో ఇలియట్స్ రోడ్‌లో నడుస్తున్నాడు రమణమహర్షి. మూడు నాలుగేళ్ళ క్రితం రెండు మూడు ఫ్లాప్ సినిమాలు తీసిన కళాత్మక భావాలు గల తెలుగు డైరెక్టర్ అతను.

రెస్టారెంట్‌కి వచ్చి ఖాళీగావున్న ఒక టేబుల్‌దగ్గర కూర్చున్న రమణకి కన్పించాడు అమరన్. విపరీతంగా ఆలోచిస్తూ టేబుల్ మీదున్న కాగితాలమీద రాసి చింపేస్తూ, పావుగంటకోసారి టీ ఆర్డర్ చేస్తూ, పది నిమిషాల కోసారి సిగరెట్ వెలిగిస్తూ సగం కాలకుండానే నేలకేసి తొక్కేస్తున్నాడు.

అరగంటసేపు అమరన్ తీరంతా గమనించిన రమణ కాసేపు ఆలోచించి, నెమ్మదిగా కొన్ని లెక్కలు వేసి దగ్గరకెళ్ళి అతనిముందు కుర్చీలో కూర్చుని తమిళంలో అడిగాడు, "మీరు ప్రేమలో పడ్డారు. అవునా?" అని.

షాకయ్యాడు అమరన్.

"మీరూ, ఒకావిడా చాలా ఇష్టడ్డారు. ఆమె మీదగ్గరకి వచ్చేద్దామని గాఢంగా తాపత్రయ పడుతోంది. కానీ రావడంలేదు. దాంతో మీ కొకరకమైన దిగులు ప్రారంభమైంది.

ఎప్పుడూ ఆమే... ఈ ప్రపంచంలో ఆమెకంటే ముఖ్యమైంది ఏదీ మీకు అన్పించడంలేదు. అవునా?"

"ఇదంతా మీకెలా తెలుసు?"

"మీకు కాస్త దూరంలో కూర్చుని మిమ్మల్ని కాస్సేపు గమనించిన వాళ్ళెవరికైనా తెలుస్తుంది... మీరు అక్టోబరు ఇరవై మూడు - నవంబర్ ఇరవై రెండు మధ్యలో పుట్టి వుంటారు?"

"నా బర్త్ డేట్ నవంబర్ ఇరవై. ఇదంతా మీరెలా తెలుసుకోగలిగారు?"

"లిండా గుడ్‌మేన్ 'లవ్ సైన్స్' చదివితే మనిషి ప్రవర్తనని బట్టి వాళ్ళ బర్త్ పీరియడ్ అంచనా వెయ్యొచ్చు" అని ఫేమస్ సన్‌సైన్ పర్సనాలిటీస్ గురించి కాస్సేపు మాట్లాడేసరికి- సందేహంలేదు ఈ తెలుగువ్యక్తి ఎవరో గొప్పవా డనిపించింది అమరన్‌కి. తనగురించి సర్వం ఇతనికి చెప్తే ఒక సాల్వేషన్ ఏర్పడేట్టు ఏదైనా చెపుతాడు అనిపించి తన గురించీ, తన ప్రేమ గురించీ సంపూర్ణంగా చెప్పిన అమరన్-

"నేను డైరెక్ట్ చేసిన నా ఫస్ట్ పిక్చర్ రిలీజ్ ఈ రోజే సార్. ఆ సినిమాకి కథ ఆమెతో నా అనుభవాలే. ఇంత తియ్యగా హింసించిన ఆమె ఇక రాకపోతే మా భవిష్యత్తు ఏమవుతుందో ఊహించుకుని ఒక ఫినిషింగ్ ఆలోచించాను. చూసినవాళ్లంతా ఆ ముగింపు అద్భుతం అంటున్నారు. నా జీవితం కూడా నా సినిమా ముగింపులా అవుతుందేమో అన్న దిగులుతో దహించుకుపోతున్నా" అన్నాడు.

కాస్సేపు ఆలోచించిన రమణ అమరన్ దగ్గరున్న పెన్ తీసుకుని, అతనిముందున్న లెటర్ పేడ్‌లో ఒక కాగితం తీసుకుని అయిదు నిమిషాల్లో లెటరొకటి తయారుచేసి చదవండి అన్నాడు.

సాంతం చదివిన అమరన్ రమణ కాళ్ళమీద పడిపోయి "అద్భుతం సార్. ఇంత గొప్పగా ఎలా రాయగలిగారు" అన్నాడు.

"ఈ సినిమా ఇండస్ట్రీకి రాకముందు మా ఊళ్ళో ప్రేమలేఖలు రాసిపెడుతుండేవాడ్ని ... ఆఖరిపేరా ఒక్కసారి చదవండి."

చదవడం మొదలెట్టాడు అమరన్-"మన ప్రేమకథనే స్క్రీన్‌ప్లే చేసి నేను తీసిన నా సినిమా విడుదల ఈ రోజే, దయచేసి వెళ్ళి చూడు. నేనిచ్చిన ముగింపులాగే మన జీవితాలు ముగియాలను కుంటే ఇక నా దగ్గరికి రాకు. ఇక నేను బతికేదికూడా ఈరాత్రి పన్నెండు గంటలవరకే." చదవడం పూర్తిచేశాడు అమరన్.

"ఈ గులాబీరంగు కాగితంమీద మీ హేండ్‌రైటింగ్‌తో కాపీ చేసుకుని వెంటనే పోస్ట్ చెయ్యండి" అన్నాడు రమణ.

వెంటనే అతను చెప్పిన విధంగా చేశాడు అమరన్.

"మీ పెళ్ళికి నన్ను తప్పకుండా పిలవాలి! అమరన్" అన్నాడు రమణ.

"మా పెళ్ళి జరిపించబోయే పెద్ద మీరే సార్" అన్నాడు అమరన్.

"థాయ్యూ" అని కదలి వెళ్ళిపోబోతున్న అమరన్‌ని చెయ్యి పట్టుకుని ఆపిన రమణ." మీరేం అనుకోకపోతే నాకు ఒక సాయంచెయ్యాలి" అన్నాడు.

"అయ్యో అంతకన్నానా? చెప్పండి సార్!"

"నేనుకూడా ప్రేమించి పెళ్ళిచేసుకున్న మనిషిని. చాలా లగ్జరీ జీవితానికి అలవాటు పడ్డ మనిషి నా భార్య. ప్రతిరోజూ ఉదయం పాలలో కూర్గు తేనె కలిపి తాగడం అలవాటు ఆమెకి.

ఇంట్లో తేనె సీసా అయిపోయి రెండురోజులైంది. ఇవ్వాళ ఎట్టి పరిస్థితుల్లోనూ తేవాలని గొడవ పెట్టింది. పరిస్థితి చెప్పాను. విన్లేదు. ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. దొరికాకే ఇంటికొస్తాను అని శపథం చేసి ఇంట్లోంచి బయటికొచ్చేశాను".

అర్థం చేసుకున్న అమరన్ అయిదొందలు రమణ చేతిలో పెట్టి "చాలా?" అన్నాడు.

"కూర్గు తేనెసీసా ఖరీదు నూటెనభై. ఈ రెండు వందలూ చాలు."అతనిచ్చిన అయిదొందల్లో మిగతా మూడువందలు అమరన్ చేతిలో పెట్టి ఆ తేనె దొరికే నీలగిరీస్ అనే షాపు దగ్గరకి బయలుదేరాడు.

ఆ రోజు సోమవారం నీలగిరీస్ సెలవు. ఒరిజినల్ తేనె ఈ షాపులో మాత్రమే దొరుకుతుంది. భార్యతో జరిగిన ఘర్షణ గుర్తొచ్చింది. ఎట్టి పరిస్థితుల్లోనూ తనడిగిన తేనె బాటిల్ సంపాయించాకే ఇంటికి వెళ్ళాలి అన్న పట్టుదలతో బీచ్‌కెళ్ళి తెల్లవారేదాకా కాలక్షేపం చేసి, మర్నాడు ఉదయం తొమ్మిది గంటలకి షాపు తెరిచేదాకా వెయిట్‌చేసి ఆ తేనె సీసా కొనుక్కుని ఇంటికి బయల్దేరాడు. రెండు బస్సులు మారి ఇంటికొచ్చే సరికి ఉదయం పదకొండు గంటలయ్యింది.

హుషారుగా ఇంట్లోకి అడుగు పెట్టిన రమణకి భార్య కనపించలేదు కానీ, టేబుల్‌మీద ఒక లెటర్ కనిపించింది.

'మీకు-

ప్రాణానికి ప్రాణంగా ప్రేమించి పెళ్ళి చేసుకోవడంతోనే అయిపోలేదు.

అన్నీ వదిలివచ్చిన ఆ మనిషి అవసరాలు తీర్చాలి, కోరికలు నెరవేర్చాలి. అవి కూడా తీర్చడానికి సంపాదించలేని మీతో ఇక బతకడం కష్టం.

నేను శాశ్వతంగా వెళ్ళిపోతున్నాను.

ఆ ఉత్తరం పక్కనే అమరన్ గులాబీరంగు కాగితం మీద రాసిన ఉత్తరం కూడా వుంది.
THE END

---

('స్వాతి' సపరివారపత్రిక 7-11-1997)*